క్లుప్తంగా

నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఉదయం కొంత సేపు ముచ్చటించారు. సంక్రాంతి సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అయోధ్యకు యువకుల సైకిల్ యాత్ర



అయోధ్యకు బయలుదేరుతున్న యువకులు

రాయికల్: పట్టణానికి చెందిన గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్ ఇద్దరు యువకులు అయోధ్య రామమందిరంలో జరిగే ప్రతిష్ఠాపనోత్సవాలకు బయలు దేరారు. రాయికల్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయోధ్య వరకు సైకిల్ యాత్ర ద్వారా ప్రయాణించనున్నారు. దాదాపు 1150 కిలోమీటర్ల దూరం ఈ యాత్ర ఉంటుందని తెలిపారు. ఈ నెల 22న జరిగే రాముడి వేడుకల్లో పాల్గొంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, తీర్థక్షేత్ర సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి పూజలు



పూజలు చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామ శివారులోని గుట్టపై అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పూజలు చేశారు. ఈ గుట్టకు అయ్యప్పగుట్టగా పేరు పెట్టినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గడీల గంగ ప్రసాద్, అర్చకులు సీతారామాచార్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత దమ్మన్నపేట



ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వారం రోజులుగా కాశెట్టి వాడ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో మండలంలోని దమ్మన్నపేట జట్టు గెలుపొందింది. విన్నర్‌గా గెలుపొందిన దమ్మన్నపేట జట్టుకు పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేశ్ ప్రథమ బహుమతి కింద రూ. 20 వేలు నగదు, రన్నర్‌గా ధర్మపురి నిలిచిన జట్టుకు సాక నిశాంత్ (యూఎస్‌ఏ) రూ.15 వేల రూ.లను అందజేశారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాదాసు నిఖిల్, గడిపెల్లి భీంరాజ్, డానీ, చందు, చల్ల రణధీర్, కాశెట్టివాడ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

28న కోరుట్లలో గ్రాండ్ ఆలిండియా ముషాయిరా

కోరుట్లటౌన్: మైనార్టీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యూనైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న కోరుట్లలో గ్రాండ్ ఆలిండియా ముషాయిరా (కవి సమ్మేళనం)నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అన్వర్ సిద్దిఖీ మొహమ్మద్ ముజాహిద్ ఆదివారం తెలిపారు. ఈ ముషాయిరాలో వివిధ రాష్ట్రాలకు చెందిన కవులు, కవయిత్రులు ఉర్దూ, తెలుగు భాషల్లో కవితాగానం చేస్తారని వారు తెలిపారు. సామాజిక సేవలు చేసిన వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు అవార్డులు, సత్కారాలు చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్,అర్బన్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఘనంగా భోగి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు హరిదాసు వేషధారణలో భోగి పండగను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి సంబరాలు నిర్వహించారు.

కథలాపూర్: మండల వ్యాప్తంగా భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజలు వేకువజామున ఒకచోటకు చేరి కర్రలను పేర్చి భోగి మంటలు కాగారు. భోగి మంటల చుట్టూ ఆడుతూ పాడుతూ సందడి చేశారు.

పెగడపల్లి: మండలంలో సంక్రాంతి భోగి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు వేకువ జామునే తలంటూ స్నానాలు.. వాకిళ్లలో ముత్యాల ముగ్గులు.. వాటి మధ్య ఆవు పేడతో తయారు చేసిన గొబ్బిళ్లు వాటి చుట్టూ నవధాన్యాలు..రేగుపళ్లు ..బంతి పూలు..గరక పోసలు పెట్టి వాకిళ్లను అందంగా తీర్చిదిద్దారు. ఉదయం ఆలయాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెగడపల్లి శివాలయంలో భోగి మంటలు కాల్చారు. చిన్నారులు పతంగులతో సందడి చేశారు.



జగిత్యాలలో భోగి మంటల వద్ద యువతీయువకులు



జగిత్యాల గణేశ్ రెసిడెన్సిలో సంక్రాంతి ముగ్గు వద్ద మహిళలు



జగిత్యాలలో భోగి సంబరాలు



కథలాపూర్ మండలం సిరికొండలో..



పెగడపల్లిలో సంక్రాంతి ముగ్గులు వేస్తున్న మహిళలు

కనుల పండువగా గోదారంగనాథుల కల్యాణం





మల్లాపూర్, కోరుట వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో గోదాదేవి-రంగనాథుల కల్యాణం

కోరుట్లటౌన్/ రాయికల్/ పెగడపల్లి/ మల్లాపూర్/ సారంగాపూర్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీగోదా రంగనాథుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఈ సందర్భంగా భక్తుల కోలాటం, చిన్నారుల నృత్యం, భజనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే సతీమణి కల్వకుంట్ల సరోజన, ఆలయ ప్రధానార్చకులు నరసింహాచారీ, ఈవో విక్రమ్, భక్తులు పాల్గొన్నారు.

రాయికల్ మండలంలోని అల్లీపూర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ గోదారంగనాయకస్వామి కల్యాణం ఘనంగా జరిగింది.

పెగడపల్లి మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో గోదా రంగనాయకుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది.



పెగడపల్లి రాజన్న ఆలయంలో గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి-రంగనాయకుల కళ్యాణంను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. .

సారంగాపూర్ మండలంలోని రేచపల్లి శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకస్వామి కల్యాణం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వివేకానందుడి జీవితం స్ఫూర్తిదాయకం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్



కట్కాపూర్‌లో బహుమతులు ప్రదానం..

పెగడపల్లి: వివేకానందుడి జీవితం స్ఫూర్తిదాయకమని ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఏడుమోటలపల్లి సర్పంచ్ ఇస్లావత్ రవినాయక్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి, యువజన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడుమోటలపల్లిలో ఆరు నుంచి 10 వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, గంగాధర్, రమేశ్, సాగర్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

రాయికల్: మండలంలోని కట్కాపూర్‌లో ఆదివారం నెహ్రూ యువ కేంద్రం సహకారంతో స్థానిక యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా ఇట్టెని అనిల్, అడిగెం కార్తీక్, యశ్వంత్‌రెడ్డి ఎంపికయ్యారు. విజేతలకు అనంతరం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గులు, ఆటల పోటీలు



సారంగాపూర్‌లో వాలీబాల్ ఆడుతున్న యువకులు

సారంగాపూర్: మండల కేంద్రంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. గ్రామానికి చెందిన చేకుట శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో 10 జట్లు పాల్గొన్నాయి. సర్పంచ్ రాజేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరాపూర్‌లో ముగ్గుల పోటీలు

రాయికల్: మండలంలోని వీరాపూర్‌లో కౌండిన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏవో పద్మావతి, సర్పంచ్ చిన్న మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలో విజేతలుగా చిన్నారులు

విచారణకు ఏడాది.. రికవరీ ఏది?

- పంచాయతీ నిధుల్లో సర్పంచ్ చేతివాటం
- తప్పుడు బిల్లులతో రూ.లక్షలు స్వాహా
- సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి అక్రమాలు
- అధికారుల తీరుపై మండిపడుతున్న గ్రామస్తులు



పంచాయతీ కార్యాలయంలో అధికారులు, సీసీఆర్ సంస్థ సభ్యులు(ఫైల్)

వెల్గటూర్: మండలంలోని జగదేవుపేట పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామస్తులు వెలికితీసినా.. అధికారులు మాత్రం రికవరీ చేయలేకపోతున్నారు. విచారణ చేపట్టి ఏడాది దాటుతున్నా.. నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

రూ.50 లక్షలకు పైగా నిధుల దుర్వినియోగం

కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ అనే సంస్థ ఆధ్వర్యంలో జగదేవుపేట గ్రామపంచాయతీ నిధులపై సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి, సేకరించిన సమాచారంతో గ్రామ పంచాయతీలో సుమారు రూ.50 లక్షలకు పైగా నిధులు దుర్వినియోగం అయ్యాయని, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాలతో అప్పటి డీఎల్పీవో కనకదుర్గ గ్రామంలో విచారణ చేపట్టారు. పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. విచారణ జరిగి ఏడాది గడిచినా.. ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు.

అభివృద్ధి పేరుతో అడ్డగోలు దోపిడీ

గ్రామపంచాయతీలో అభివృద్ధి పేరుతో తప్పుడు బిల్లులు సృష్టించి, అధికారుల సహకారంతో ఎంబీ రికార్డ్స్ సృష్టించి లక్షలాది రూపాయలు అడ్డగోలుగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని గ్రామస్తులు ఆరోపించారు. ఇంతపెద్ద మొత్తంలో అవినీతి జరుగుతున్నా బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి నరేశ్‌ను వివరణ కోరగా జగదేవుపేటలో జరిగిన నిధుల అవకతవకలపై గానీ, డీఎల్పీవో విచారణ గురించి గానీ తనకు సమాచారం తెలియదని చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా పంచాయితీలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అడ్డగోలుగా దోచేశారు



జగదేవుపేట గ్రామపంచాయతీలో అడ్డగోలుగా నిధుల దుర్వినియోగం జరిగింది. ప్రజల సొమ్మును అక్రమంగా దోచుకున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారు. పంచాయతీ నిధులు దోచుకున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– సింగం శ్రీకాంత్, జగదేవుపేట

సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి..



పంచాయతీ నిధులపై సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతి వెలుగు చూసింది. సుమారు 50 లక్షల వరకు నిధుల దుర్వినియోగం జరిగింది. విచారణ జరిగి ఏడాది గడిచినా ఇప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. అవినీతి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. దోచిన సొమ్ము రికవరీ చేసే వరకు పోరాటం చేస్తాం.

– ఆడెపు శ్రీధర్, సీసీఆర్ సభ్యుడు, జగదేవుపేట

యువకుడికి దేహశుద్ధి



జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అంగడి బజార్‌లో పువ్వులు విక్రయిస్తున్న మహిళా రైతును దూషించిన వ్యక్తికి ఆదివారం దేహశుద్ధి జరిగింది. గొల్లపల్లి మండలం రాఘవపేటకు చెందిన రాజవ్వ అంగడిబజార్‌లో పువ్వులు విక్రయిస్తోంది. జగిత్యాలకు చెందిన ఓ వ్యక్తి పువ్వులు కొనుగోలు చేయడానికి వచ్చి ఆమెతో బేరమాడాడు. అతడు అడిగిన ధరకు పువ్వులు ఇవ్వకపోవడంతో ఆమెను అసభ్య పదజాలతో దూషించాడు. దీంతో ఆగ్రహించిన మహిళ అతడికి దేహశుద్ధి చేసింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: పట్టణంలోని మహేంద్ర సంఘం భవనంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహేంద్ర సంఘం పట్టణశాఖ అధ్యక్షుడు చిలువేరు రాజయ్య, ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి గోపాల్ సమక్షంలో సభ్యులను ఎన్నుకున్నారు. మామిడిపెల్లి గోపాల్, భూమయ్య, చిలువేరు మహేందర్, చింత లింగయ్య, పిల్లి రవి, శంకర్‌ను సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి సత్యనారాయణ, మామిడిపెల్లి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.



ఎన్నికైన మహేంద్ర సంఘం నూతన కార్యవర్గం

కాంగ్రెస్ లీగల్ అడ్వైజర్‌గా రమేశ్



రమేశ్

కోరుట్లటౌన్: కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ లీగల్ అడ్వైజర్‌గా కస్తూరి రమేశ్‌ను నియమించినట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆదివారం పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు తిరుమల గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.